



ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

బోగస్ ఓటర్లే ఎక్కువ...

- ఉపాధ్యాయ ఓటర్లుగా అనర్హుల నమోదు - ప్రయివేటు విద్యాసంస్థల్లో కొనసాగుతున్న వైనం
- బోగస్ ఓటర్లను నియంత్రించాలి - ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున బోగస్ ఓటర్లు నమోదవుతున్నాయి. ఓటరు నమోదు ప్రక్రియ అధికార పార్టీ నాయకుల కనుసన్నుల్లో సాగుతోంది. ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఈ తతంగం భారీగా కొనసాగుతోంది. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి స్థానానికి వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పాఠశాలలోని స్కూల్ అసిస్టెంట్లు, లెక్చరర్లు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, ప్రొఫెసర్లు ఓటు హక్కును కలిగి ఉంటారు. ఈ స్థానానికి జరిగే పోలింగ్‌లో వీరు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ప్రస్తుత శాసనమండలి ఎన్నికల్లో అధికార పార్టీకి తీవ్ర వ్యతిరేకత ఉంది. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల విసుగెత్తి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇప్పుడు ఈ మండలి ఎన్నికల్లో అధికార పార్టీ గెలిచేందుకు అన్ని కుట్రలూ పన్నుతోంది. ప్రయివేట్ విద్యాసంస్థల్లో స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నమోదు చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులకు పిఎఫ్ చేస్తున్న రసీదులతో డిఇఒ ధ్రువీకరించిన అనంతరం వారిని మాత్రమే ఓటర్లుగా నమోదు చేయాలి. అలాకాకుండా ఇష్టానుసారంగా ప్రయివేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను ఓటర్లుగా నమోదు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు వీరిని ఓటర్లుగా నమోదు చేయాలని విద్యాశాఖ, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మరో వైపు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల ఓటరు నమోదుకు రెవెన్యూ అధికారులు అనేక ఆటంకాలు సృష్టిస్తున్నారు. వీరు ఓటర్లుగా నమోదు కాకుండా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పెద్ద ఎత్తున బోగస్ ఓటర్లు నమోదవుతున్నా జిల్లా ఎన్నికల అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బోగస్ ఓటర్ల నమోదు కాకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులను కోరుతున్నాయి.



బోగస్ ఓటర్లను అరికట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు (ఫైల్)

ఉపాధ్యాయ మండలి స్థానానికి వచ్చిన ఓటరు దరఖాస్తులు

ఆన్‌లైన్‌లో వచ్చినవి	4283
ఆఫ్‌లైన్‌లో వచ్చినవి	22
మొత్తం వచ్చిన దరఖాస్తులు	4305

బోగస్ ఓటర్లను అరికట్టాలి

- కె.సురేష్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు



పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి స్థానంలో పెద్దఎత్తున బోగస్ ఓటర్లు నమోదు అవుతున్నారు. జిల్లా ఎన్నిక అధికారులు బోగస్ ఓటర్లపై దృష్టి సారించి, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించాలి. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఉన్న వారిని మాత్రమే ఓటర్లుగా నమోదు చేయాలి.

నిబంధనల ప్రకారం ఓటర్లను గుర్తించాలి

- గోకారి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శాసనమండలి ఉపాధ్యాయ స్థానంలో ఓటర్ల నమోదు ప్రక్రియ జరగాలి. అర్హులైన వారిని మాత్రమే ఓటర్లుగా నమోదు చేయాలి. ఎన్నికల అధికారులు ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించాలి.

ఓటరు దరఖాస్తులను పరిశీలించాలి

- జి.హృదయ రాజు, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



జిల్లాలో ఉపాధ్యాయ శాసనమండలి స్థానంలో కొనసాగుతున్న ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించాలి. ప్రయివేట్ విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున బోగస్ ఓటర్లను నమోదు చేస్తున్నారు.

ప్రజల గొంతుకను ఆదరించండి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి-పత్తికొండ

ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రజల గొంతుకనై చట్ట శాసనమండలిలో వినిపిస్తానని పిడిఎఫ్, ప్రజాసంఘాలు బలపరిచిన పశ్చిమరాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం పత్తికొండలో వివిధ విద్యాసంస్థలలో , పట్టభద్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభలలో వ్యక్తిగత దూషణలతో నిందారోపణలతో చట్టసభల విలువలను తగ్గించే పద్ధతిలో ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని వారికి ఓటు ద్వారా బుద్ధి చెబుదామని, ప్రజల తరపున మాట్లాడే గొంతుకు అయిన తనను ఆదరించాలని కోరారు. ప్రజల తరపున మాట్లాడవలసిన చట్టసభలు నేటి ప్రజా ప్రతినిధుల వ్యవహార శైలి వలన కలుషితమై పోతున్నాయన్నారు. వ్యక్తిగత దూషణతో ప్రజల ప్రజా సమస్యలను పక్కదో పట్టిస్తున్నారని దీంట్లో అధికార ప్రతిపక్ష పార్టీలు భాగస్వాములుగా ఉండడం బాధాకరమని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు పేర్కొన్నారు. ప్రధానంగా శాసన మండలిలో అధికార ప్రతిపక్ష పార్టీలు మండలిని రాజకీయ వేదికగా మలుచుకుంటున్నాయని, మేధావులు ఉండవలసిన మండలిలో కంపు రాజకీయాలు చేరి శాసన వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఆయా ప్రాంతాలలో కోకొల్లలుగా ఉన్నటువంటి ఉద్యోగ ,కార్మిక, విద్యార్థి ,యువజన సమస్యల పట్ల ప్రజాప్రతినిధులు మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతున్న రాయలసీమ అభివృద్ధి పట్ల వీరికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అందుకే శాసనమండలి లో ప్రజల తరపున ప్రజా గొంతుకగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థిగా తనను నిలబెట్టిందని నా గెలుపునకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. బూటకపు వాగ్దానాలతోనూ మాటలతోనూ మన దగ్గరకు వచ్చేటువంటి సూడో నాయకులకు పట్టభద్రులు ఎన్నికలలో బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. నాగరాజు తరుపున పలువురు మేధావులు విద్యావంతులను కలిశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా నాయకులు రామ్మోహన్ రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు బి.వీరశేఖర్, రైతు సంఘం నాయకులు రాజా సాహెబ్,కారన్న రామాంజనేయులు, సిఐటియు నాయకులు దస్తగిరి శ్రీరాములు రంగస్వామి పాల్గొన్నారు.

ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణను ఎన్నుకున్నట్లు సమాచారం. ఆలూరు మండల పరిధిలోని కమ్మరచెడు గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి సతీమణి హరిపుష్పావతమ్మ చైర్మన్‌గా పదవీ కాలం పూర్తయింది. గుమ్మనూరు నారాయణను ఎంపిక చేసినట్లు తెలిసింది. మంత్రి గుమ్మనూరు జయరాంకు నారాయణ సమీప బంధువు. మంత్రి సొంత మండలంలో గుమ్మనూరు నారాయణ పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారు.



ప్రజల భాగస్వామ్యంతో గ్రంథాలయాల అభివృద్ధి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి - గూడూరు

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రంథాలయాల అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ తెలిపారు. శనివారం గూడూరులో ఉన్న గ్రంథాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సుభాష్ చంద్రబోస్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే గూడూరు పట్టణంలో 10 సెంట్ల స్థలాన్ని కేటాయించి రూ.30 లక్షలతో గ్రంథాలయానికి సొంత భవనం నిర్మిస్తామని చెప్పారు. అనంతరం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకొని గ్రంథాలయాల్లో లభించే పుస్తకాలను చదవాలని కోరారు. మంచి మేధోశక్తి లభిస్తుందన్నారు. అలాగే విద్యార్థులకు అవసరమయ్యే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. తహశీల్దార్ శివరాముడు, చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పిఎన్.అస్లాం, మాజీ జడ్‌పిటిసి ఎల్.వెంకటేశ్వర్లు, ఎంఇఒ సుశీలమ్మ పాల్గొన్నారు.



ఎల్ఎల్‌సి నీటి కష్టాలు...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తుంగభద్ర లో లెవల్ కెనాల్ (ఎల్ఎల్‌సి)కు నీటి విడుదల నిలిపివేయడంతో జిల్లా వ్యాప్తంగా ఎల్ఎల్‌సి కింద ఉన్న ఆయకట్టు భూములకు నీరు అందకుండా పోయాయి. దాదాపు 15 రోజులు ఇదే పరిస్థితి ఏర్పడింది. కర్ణాటకలోని హగరి నుంచి వచ్చే కెనాల్‌లో 121వ కిలోమీటరు వద్ద మరమ్మతులు చేయాల్సి ఉండడంతో నీటి విడుదలను ఆపివేశారు. కింది పొలాలకు చుక్క నీరు కూడా అందని దుస్థితి నెలకొంది. సాగు చేసిన పంటలు కనీసం వర్షం ఆధారంగానైనా కాపాడుకోవచ్చని అనుకున్నా వర్షం కూడా కురవలేదు. అన్నదాతలకు ఆందోళన తప్పలేదు. చివరికి మరమ్మతు పనులు పూర్తి చేయడంతో ఎల్ఎల్‌సి నుంచి నీటిని కిందికి వదిలారు.

బెట్టింగ్ జోరు..

టీ-20 వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతుండడంతో జిల్లావ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్ జోరందుకుంది. యువత పెద్ద ఎత్తున బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ వ్యవహారం మొత్తం నడుస్తోంది. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని కొందరు రోడ్డు మీద పడుతున్నారు. పోలీసులు పెద్ద ఎత్తున నిఘా పెట్టి యువత బెట్టింగ్ వైపు మళ్లకుండా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గర్జించిన కార్మిక లోకం...



కార్మిక లోకం గర్జించింది. ఎమ్మిగనూరులో సిఐటియు జిల్లా మహాసభ నిర్వహించారు. తొలి రోజు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అనంతరం ప్రతినిధుల సభ నిర్వహించారు. కార్మిక సమస్యలపై పోరాడేందుకు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకున్నారు. జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రాధాకృష్ణ, అంజిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మొదలైన ఎమ్మెల్సీ ఎన్నికల వేడి : జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల వేడి మొదలైంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండగా దాదాపు అభ్యర్థులు ఖరారయ్యారు. ఓట్ల నమోదును కూడా రాజకీయాలకు వాడుకుంటూ కార్యాలయాల్లో ఓట్లను నమోదు చేయిస్తున్నారు. శాసన మండలిలో ప్రజల గొంతుక వినిపించే అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. ముందుగా 7లోపు ఓటును నమోదు చేసుకోవడం కూడా చాలా ముఖ్యం.

అవీ.. ఇవీ.. అన్నీ..: డివైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. టిడిపి నాయకులు అయ్యన్న పాత్రుడిని అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

విద్యార్థులకు విజిలెన్స్‌పై అవహగాహన

ప్రజాశక్తి-కర్నూలు క్రైం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎస్‌పి తిరుమలేశ్వర్‌రెడ్డి

విజి లెన్స్ వారోత్స వాల్లో భాగంగా కర్నూల్ నగరంలో విజిలెన్స్ ఎన్ ఫోర్స్‌మెంట్ ఎస్‌పి డాక్టర్ తిరుమలేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాల, పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీల్లో విజిలెన్స్ అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవినీతి నిర్మూలన అనే అంశంపై వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. డాక్టర్ తిరుమలేశ్వర్ రెడ్డి బహుమతులు అందజేశారు. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో విజిలెన్స్ పట్ల విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి, గుణకర్ రెడ్డి, సిఐ శ్రీధర్, ఎంఆర్ఒ వెంకటనారాయణ పాల్గొన్నారు.

వలస కార్మికుల పిల్లలను వసతి గృహంలో చేర్పించాలి

ప్రజాశక్తి- తుగ్గలి

తుగ్గలి మండలం పరిధిలోని వివిధ గ్రామాలలో వలస కార్మిక పిల్లలను ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల రాతనలో చేర్పించాలని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామయ్య శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వలస పోయే కార్మికుల పిల్లలు ఇంటిదగ్గర ఇబ్బందులు పడకుండా ఉండకూడదనే ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు బాల, బాలికలను వసితి గృహంలో చేర్పించాలని ఆయన కోరారు. వారికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలను వసతి గృహంలోనే అందిస్తామన్నారు. వలసలు వెళ్లే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఓసి వలస కార్మికుల పిల్లలను కచ్చితంగా చేర్పించాలని ఆయన కోరారు. ఈ అవకాశాలను వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బెళగల్‌లో వేరుశనగ పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి-సి బెళగల్



వేరుశనగ పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

బెళగల్‌లోని సర్వే 230/3 లో వ్యవసాయ విస్తరణ అధికారి మధుమోహన్ శనివారం వేరుశనగ పంటకోత ప్రయోగం చేశారు. దాని ఫలితాంగా ఎకరాకు 396 కేజీలు వచ్చే అవకాశం ఉందని ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. ప్రతి రైతు ఈ పంట కోత ప్రయోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పంటకోత ప్రయోగంతో ఎన్ని ఎకరాల్లో సాగు చేశాం. ఎంతదిగుబడి వచ్చిందనే వివరాలను అంచనా వేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

భారీ ఎత్తున సెల్‌పోన్ల రికవరీ

జిల్లా పోలీసు కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా
రూ. 2 కోట్ల 50 లక్షల విలేవైన పోన్ల అందజేత

ప్రజాశక్తి-కర్నూలు క్రైం



సెల్‌పోన్‌ను అందజేస్తున్న ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్

కర్నూలు జిల్లా ఎస్‌పి భారీ ఎత్తున మొబైల్ ఫోన్లను రికవరీ చేసి మరోసారి తన సత్తాను చాటుకున్నారు. కేవలం రెండు నెలల్లోనే సుమారు రూ.3.7 కోట్ల విలువ కలిగిన 1600కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించిన ఘనత ఆయనకే దక్కింది. ఈ నేపథ్యంలో ఆయన సేవలను జిల్లా ప్రజలు కొనియాడుతున్నారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా కర్నూలు పోలీసులు అతి తక్కువ సమయంలోనే రెండవ విడతలో భాగంగా వివిధ రాష్ట్రాల నుండి రికవరీ చేసిన 1047 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ శనివారం బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పేరడ్ మైదానంలో 'మొబైల్ రికవరీ మేళా' కార్యక్రమాన్ని జిల్లా ఎస్‌పి ఏర్పాటు చేశారు. ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ డిజిపి, ప్రభుత్వం ఆదేశాల మేరకు మొబైల్ రికవరీ మేళా నిర్వహించామన్నారు. 1000కు పైగా ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. 4 వేలకు పై ఫిర్యాదులు వచ్చాయని వాటిన్నింటి పై చర్యలు తీసుకుంటున్నామన్నారు. కర్నూలు పోలీసు మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు మీడియా వారు సహకరించాలన్నారు. 100 శాతం మొబైల్ వెతికి పట్టుకుని ఇచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. మొదటి విడతలో 600 పైగా ఫోన్లు రికవరీ చేశామన్నారు. వాటి విలువ రూ. 1.2 కోట్ల విలువ ఉంటుందన్నారు. రెండవ విడతలో సుమారుగా 1047 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామన్నారు. వాటి విలువ 2.5 కోట్ల విలువ ఉంటుందన్నారు. జిల్లా ఎస్‌పికి, కర్నూలు పోలీసులకు సెల్ ఫోన్లు పొందిన బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. సల్‌ఫోన్ పోయిన వారు మీరు ప్రస్తుతం ఉపయోగిస్తున్న మొబైలు నెంబర్, ప్రత్యామ్నాయ ఫోన్ నెంబరు వివరాలు మీ-సేవా నందు సమర్పించి Missing /lost articles రుసుమును చెల్లించాలని చెప్పారు. సదరు మీ-సేవా రసీదును తమ పరిధిలోని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ డి. ప్రసాద్, కర్నూలు పట్టణ డిఎస్‌పి కెవి మహేష్ , కర్నూలు టు టౌన్ సిఐ శ్రీనివాసులు, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీం ఎస్ఐ వేణుగోపాల్, సైబర్ ల్యాబ్ సిబ్బంది ఉన్నారు.

తహశీల్దార్ లేక ప్రజల అవస్థలు


ప్రజాశక్తి-మద్దికెర

మండల కేంద్రంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగభూషణం సెలవుపై వెళ్లడంతో దాదాపు నాలుగు ఐదు రోజుల నుంచి మండల ప్రజలు విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ఉన్న ఇన్చార్జి బాధ్యతలు డిజిటల్‌కే లేకపోవడంతో ఏం చేయలేని పరిస్థితి. శనివారం విద్యార్థులు ప్రజలు మాట్లాడుతూ ఇన్‌కమ్, క్యాస్ట్, ఒబిసి, బిసి సర్టిఫికెట్లతో పాటు పలు సర్టిఫికెట్లపై సంతకాలు అవసరమై కార్యాలయం చుట్టూ తిరుగుతూ నిరాశకు గురవుతున్నామని ఆ వేదన వ్యక్తపరిచారు. మండలంలో ప్రధాన అధికారి సెలవుపై వెళ్ళినప్పుడు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పజెప్పాలని కోరారు.

జిజిహెచ్ సెక్యూరిటీ గార్డ్స్‌కు పెండింగ్ జీతాలు చెల్లించాలి

ఉద్యోగ భద్రత కల్పించాలి-గాంధీ విగ్రహం వద్ద ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న విజయ్

కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పనిచేసే సెక్యూరిటీ గార్డ్స్, సూపర్వైజర్స్‌కు 3నెలల పెండింగ్ జీతాలు చెల్లించి, రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో పనిచేసే సెక్యూరిటీ గార్డ్స్, సూపర్వైజర్స్ కార్మికులకు 3 నెలల పెండింగ్ జీతాలు చెల్లించి రెగ్యులర్ చేయాలని కోరుతూ సెక్యూరిటీ గార్డ్స్ ఆఫీస్ నుండి సూపరింటెండెంట్ ఆఫీసు వరకు ర్యాలీగా వచ్చి గాంధీ విగ్రహం ముందు సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.విజయ్, సిఐటియు జిల్లా నాయకులు ఆర్.కృష్ణ, సిఐటియు నగర నాయకులు రమేష్, కుమార్, బాలతిమ్మయ్య, గణేష్ లు పాల్గొన్నారు. విజయ్ మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్, సూపర్వైజర్స్‌కు 3 నెలల నుండి జీతాలు ఇవ్వకుండా ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ వారు, హాస్పిటల్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారన్నారని తెలిపారు. జీతాలు రానందున కార్మికులు కుటుంబ పోషణ ఇబ్బంది అయిందని కరెంటు బిల్లులు, ఇంటి బాడుగలు, స్కూల్ ఫీజులు, కిరాణం షాపుల్లో అప్పులు కట్టలేక చాలా అవస్థలు పడుతున్నారని వారన్నారు. కార్మికులు పోరాటాల వలన బడ్జెట్ సాధించినా ప్రభుత్వ హాస్పిటల్ అధికారులు, ఏజెన్సీ వారు కార్మికులకు ఎందుకు జీతాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం, హాస్పిటల్ అధికారులు, ఏజెన్సీ వారు కార్మికుల పైన వేదింపులు ఆపి పెండింగ్‌జీతాలు ఇచ్చి, ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డ్స్ కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గురుశేఖర్

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురుశేఖర్

ప్రజాశక్తి-గూడూరు

రజకుల సాంఘిక భద్రత కోసం ఎస్‌సి, ఎస్‌టి తరహాలో సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురు శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గూడూరు వీరభద్ర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురుశేఖర్, జిల్లా అధ్యక్షుడు సి.ముక్కన్న మాట్లాడారు. ప్రతి మనిషి వేసుకునే బట్టలను శుభ్రం చేస్తూ తన జీవితాలను అనారోగ్య పాలు చేసుకుంటున్న రజక వత్తిదారుల ఆదుకోవడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. రజకులపై సాంఘిక బహిష్కరణ, దాడులు, దౌర్జన్యాలు లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు ఎదుర్కొంటూ తీవ్రంగా అవమానాల గురై జీవిస్తున్నారని ఇప్పటివరకు పాలించిన పాలకులు , ప్రభుత్వం ఉన్నతాధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్యం ప్రభుత్వ విధానాలకే దీనికి కారణమని చెప్పవచ్చన్నారు. ఈ మధ్యకాలంలో శ్రీకాకుళం జిల్లాలో సగడం మండలం బాతువ అనే గ్రామంలో 40 కుటుంబాలను గ్రామంలోని అగ్ర వర్ణ కులాలకు చెందిన వారు , సర్పంచి కలిసి రజకులను గ్రామ బహిష్కరణ చేశారన్నారు. రజకులకు సాంఘిక భద్రత కొరకు ఎస్సీ ఎస్టీ తరహాలో సామాజిక చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న తరహాలో ఎపి ప్రభుత్వం కూడా ప్రతి రజక కుటుంబానికి వృత్తిదారులందరికీ 20050 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. గూడూరు రజక సంఘం అధ్యక్షులు సి.శేషన్న అలీషా రమేష్ మద్దిలేటి, లక్ష్మన్న పాపన్న, సిద్దయ్య ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని ఆహ్వానించిన గంథాలయ చైర్మన్

ప్రజాశక్తి- కర్నూలు క్రైం



కర్నూలు ఎంఎ శ్రీ సంజీవ్ కుమార్‌ని ఆయన కార్యాలయంలో గ్రంథా లయ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ మర్యాద పూర్వకంగా 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఆహ్వానిం చారు. నవంబర్ 14 నుంచి నిర్వహిం చనున్న వేడుకల్లో భాగ స్వాములు కావాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టించుకోకపోతే

పట్టా క్యాన్సిల్ చేయండి

- బోరబండ జగనన్న లేఅవుట్‌ను పరిశీలించిన కలెక్టర్

- త్వరగా పూర్తి చేయాలి ఎంపిడిఒ, తహశీల్దార్‌కు సూచన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ఇంకా ఎవరైనా జగనన్న కాలనీలో వచ్చిన ప్లాట్‌ను సద్వినియోగం (కట్టించుకోలేకపోతే) చేసుకోలేకపోతే వారి పట్టాను క్యాన్సిల్ చేసి మరొకరికి అవకాశం ఇవ్వాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు. శనివారం కోటేకల్ పంచాయతీ మజరా గ్రామమైన బోడబండలో జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. అన్ని మౌలిక వసతులు విద్యుత్, డ్రెయినేజీ, తాగునీరు ఉన్నాయో లేదో అని సంబంధిత అధికారులను అడిగి ఆరా తీశారు. జెసి రామసుందర్ రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్ జయన్న, ఎంపిడిఒ బంగారమ్మ, హౌసింగ్ డిఇ ప్రసాద్ పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి

- ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి - ఆస్పరి



ప్రచారం నిర్వహిస్తున్న పోతుల నాగరాజు

ప్రజల కోసం పనిచేసే తమలాంటి వారిని ఆదరించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు ఓటర్లను కోరారు. శనివారం ఆస్పరిలో ప్రచారనాలో భాగంగా విజేత స్కూల్, జడ్‌పిహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు, ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు సిపిఎస్‌ను రద్దు చేస్తానని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చి రద్దు విషయంలో మాట తప్పాడని పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగాల ఉద్యమాలను నిర్బంధం చేస్తూ నిరంకుశతత్వాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు హనుమంతు, మల్లేష్ పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల



మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్ కుమార్

రాజీమార్గమే రాజమార్గమని ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్, ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ సిఐ మంజునాథ్ తెలిపారు. ఈనెల 12న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం గోనెగండ్లలోని పోలీసు స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించిన కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివిధ కారణాలతో గొడవలు పడి పరస్పరం కేసులు పెట్టుకున్న వారు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ అయ్యి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఆదోని డివిజన్ డీఎస్పీ పరిధిలో ఈనెల 1 నుంచి ఇప్పటివరకు 663, గోనెగండ్ల పోలీసు స్టేషన్‌లో 44 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇన్‌ఛార్జీ ఎస్ఐ తిమ్మారెడ్డి, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గోనెగండ్లలో జగనన్న స్వచ్ఛ గ్రంథాలయం

ప్రజాశక్తి - గోనెగండ్ల



పుస్తకాలను శుభ్రపరుస్తున్న సిబ్బంది

గోనెగండ్లలోని శాఖ గ్రంథాలయంలో శనివారం జగనన్న స్వచ్ఛ గ్రంథాలయం కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి బి.గిరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'మనం - మన గ్రంథాలయం' కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా మొదటి శనివారం జగనన్న స్వచ్ఛ గ్రంథాలయం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రంథాలయంలో పాఠకులతో కలిసి ఆవరణతోపాటు పుస్తకాలను దుమ్ము, దులిపి శుభ్రపరచినట్లు చెప్పారు. పాఠకులు బావిగడ్డ పెద్ద వీరన్న, ఈశ్వర్, రంజాన్ వలీ పాల్గొన్నారు.

వలసల నివారణపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి - ఆదోని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు

ఆదోని ప్రాంతంలో వలసల నివారణపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. ఆదోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీపై మంత్రి గుమ్మనూరు జయరాం, ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడారు. ఆదోని ప్రాంత నియోజకవర్గాలు పత్తికొండ, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. ఈ నియోజకవర్గాల్లోని ప్రజలు ఉపాధి కోసం వలసలకు వెళ్తున్నారని చెప్పారు. వాటిని నివారించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఐదు నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం అయ్యారని, ప్రజా ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకున్నారని తెలిపారు. వలసలను నివారించి, వారికి ఇక్కడే ఉపాధి కల్పించేలా ఐదుగురు ఎమ్మెల్యేలు పలు సూచనలు చేసినట్లు చెప్పారు. ఈ సూచనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కార్యాచరణను రూపొందిస్తారని వివరించారు. అనంతరం ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. ఆదోని ప్రాంత అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలను కలెక్టర్‌కు వివరించామని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ పి.కోటేశ్వరరావు మంత్రి, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. వలసల నివారణకు ఆయా నియోజకవర్గాల్లో తీసుకోవాల్సిన చర్యలను మంత్రి, ఎమ్మెల్యేలను అడిగి తెలుసుకున్నారు. జెసి రామ సుందర్ రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ రెడ్డి, రమణకాంత్ రెడ్డి, తహశీల్దార్ వెంకటలక్ష్మి ఉన్నారు.

తలుపులు మూసుకొని సమీక్ష

ఆదోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదోని ప్రాంత అభివృద్ధిపై సమావేశం జరిగింది. సమావేశం 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తలుపులు మూసుకొని రహస్యంగా నిర్వహించడంతో పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఆదోని పట్టణంలో రోడ్ల వెడల్పు, ఎల్ఎల్‌సి ఆధునీకరణ, సాగునీటి సౌకర్యం కోసం ప్రాజెక్టు నిర్మాణం సమస్యలు ఉన్నా ప్రస్తావన లేకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రజాభిప్రాయ సేకరణ, ప్రజా సంఘాల నాయకుల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. అధికారులు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా ఎమ్మెల్యేలతో రహస్యంగా సమావేశం నిర్వహించడం వల్ల ఈ ప్రాంత అభివృద్ధికి ఏ చర్యలు తీసుకుంటున్నారో స్పష్టత లేదని చెబుతున్నారు. సమావేశం తీర్మానం కూడా బహిర్గత పరచడం లేదని పేర్కొంటున్నారు.

కంటిజబ్బులను నిర్లక్ష్యం చేయవద్దు

- ఐఎంఎ ఆదోని ప్రెసిడెంట్ సైపుల్లా

ప్రజాశక్తి - ఆదోని

అవయవాల్లో అన్నిటికన్నా కళ్లు సున్నితమైనవని, వాటికి సోకే వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరీక్ష నిర్వహించుకుని చికిత్సలు చేయించుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదోని ప్రెసిడెంట్ సైపుల్లా, లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్, సీనియర్ డాక్టర్ గోపీనాథ్, చిన్నపిల్లల వైద్యులు కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆదోని పట్టణంలోని నారాయణ స్కూల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. రోగులకు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణమూర్తి, ఉషారావు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కంప్యూటర్, సెల్‌ఫోన్, ఇతర రేడియేషన్ వచ్చే వాటిని తరచుగా చూడడం వల్ల కళ్లకు జబ్బులు వచ్చే అవకాశం అధికంగా ఉందని తెలిపారు. వైద్యుల సలహా మేరకు ప్రతి ఆరు నెలలకోసారి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. చిన్నపాటి సైట్ ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి చూపును మెరుగుపరచుకోవాలని తెలిపారు. మంచి పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని వివరించారు. సుమారు 100 మంది దాకా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు, మందులు ఉచితంగా అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు ధర్మారెడ్డి, ఓం ప్రకాష్, గోవిందరావు ఉన్నారు.



కంటి పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

నందవరం : ఎమ్మిగనూరు నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్ సెలక్షన్‌లో విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14 విభాగంలో 100, 600 మీటర్ల లాంగ్ జంప్ విభాగంలో 9వ తరగతి జె.చంద్ర శేఖర్ మొదటి స్థానం, రామ్మోహన్, 8వ తరగతి, 100, 600 మీటర్లలో 2వ స్థానం, 200 మీటర్ల బీరలింగ 3వ స్థానం విజయం సాధించారు. అలాగే అండర్-17 బాల్ బ్యాడ్మింటన్‌లో శ్రీనివాసులు విజయం సాధించారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో జరిగిన అథ్లెటిక్ సెలక్షన్‌లో అండర్-14 విభాగంలో ప్లేస్ సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు బి.అరుణ శనివారం అభినందించి, బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు హనీఫ్, ఉపాధ్యాయులు లచ్చప్ప, భోజరాజు, భీమచారి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ట్రై సైకిళ్లు పంపిణీ

హోళగుంద : మండలంలోని ఎల్లార్తి గ్రామంలో పారిశుధ్య కార్మికులకు మూడు చక్రాల సైకిళ్లను సర్పంచి చాముండేశ్వరి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి చాముండేశ్వరి, వైసిపి యువ నాయకులు ఎస్‌కె.గిరి మాట్లాడారు. గ్రామంలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. తడి, పొడి చెత్త వల్ల ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. వర్మీకంపోస్ట్ రూపంలో ఎరువుగా మార్చుకొని పొలంలో చల్లడం వల్ల పంట దిగుబడి అధికంగా వస్తుందని చెప్పారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



సైకిళ్లను పంపిణీ చేస్తున్న నాయకులు

డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ రంజాన్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు క్యాబ్ అసోసియేషన్ సభ్యులు. అక్టోబర్ 28న కర్ణాటక రాష్ట్రంలోని గుంజళ్లి, గిల్లేసూగూర్ గ్రామాల మధ్య వాహనం టైర్ పగిలి చెట్టును ఢీకొట్టి డ్రైవర్ రంజాన్ మృతి చెందారు. ఈ సంఘటన వల్ల కుటుంబం కష్టాల పాలు కావడంతో స్పందించిన వైసిపి మండల నాయకులు, క్యాబ్ అసోసియేషన్ నాయకులు పెట్రోలు బంక్ శీను ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. రంజాన్ గతంలో మంత్రాలయంలో పలు వాహనాలకు డ్రైవర్ పని చేశారు. మృతుడు రంజాన్ కుటుంబానికి అండగా ఉండాలని క్యాబ్ డ్రైవర్లు, యజమానులు కలిసి రూ.65 వేలు వసూలు చేసి మృతుని భార్య గౌసియాకు గిల్లేసూగూరు క్యాంపులో అందజేశారు.

'ముద్దు గడ్డ'తో పశువులు మృత్యువాత

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండలంలో ముద్దగడ్డ వ్యాధితో పశువులు మృత్యువాత పడుతుండడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి ఎద్దులు, ఆవులకు వ్యాపిస్తోంది. పశువులకు యద భాగం, కాలు, కడుపుపై వాపు వస్తోంది. ఈ వ్యాధి సోకిన పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. ఆస్పరితో పాటు బిణిగేరి, ఐనకల్లు, కారుమంచి తదుపరి గ్రామాల్లో వ్యాధి ఎక్కువగా వ్యాపించింది. ఈ వ్యాధి బారిన పడి పశువులు మృతి చెందడంతో రైతులు నష్ట పోతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

రోడ్డుపైనే మురుగు

- డ్రైనేజీల్లేక గ్రామస్తులు అవస్థలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. అధిక వర్షాల కారణంగా నిలిచి ఉన్న మురుగు నీరు రోడ్లపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై వాహనాలు వెళ్తున్నప్పుడు వాటి నుంచి మురుగు నీరు ఇళ్లపైకి పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో కూడా రోడ్డు లేకపోవడం వల్ల కాలనీవాసులు వారి పనుల నిమిత్తం పొలాలకు వెళ్లడానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో దోమల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. రోడ్డు పక్కనే రెయిన్‌బో ప్రయివేట్ స్కూలు ఉంది. అందులోని విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిసి దాదాపు పది రోజులవుతున్నా అక్కడ ఉన్న మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. సర్పంచి, పంచాయతీ సెక్రటరీ పట్టించుకోకపోవడం బాధాకరమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రోజూ అదే దారిలో ప్రయాణిస్తున్న అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దేవనకొండ : మండలంలోని నేలతలమర్రి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన, జాతీయ సమగ్ర గురించి దేవనకొండ బ్రాంచి ఎంవి రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాతా బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కె.రామకృష్ణ మాట్లాడారు. బ్యాంకులో ఉన్న పథకాలు, రుణాలు, సామాజిక భద్రత, జీవన జ్యోతి బీమా యోజన పథకం, సురక్ష బీమా పథకం, అటల్ పెన్షన్ యోజన పథకం ఇన్స్యూరెన్స్ పథకాల గురించి వివరించారు. బ్యాంకులో అందిస్తున్న స్కీములు, సేవల గురించి వివరించారు. ఫీల్డ్ ఆఫీసర్ దామోదర రెడ్డి, క్యాషియర్ సునీల్ కుమార్ యాదవ్, కళాజాతా బృందం సభ్యులు రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతు భరోసాకు నమోదు చేసుకోండి : ఎఒ

దేవనకొండ : రైతు భరోసా 2022-23కు సంబంధించి రైతు భరోసా డబ్బులు పడని రైతులకు గ్రీవెన్స్ నమోదు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎఒ అధికారి సురేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. రైతు భరోసా డబ్బులు పడని, కొత్తగా పాస్ బుక్ చేసుకున్న రైతులు, కౌలు కార్డు ఉన్న రైతులు రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చి నమోదు చేసుకోవాలని తెలిపారు. పిఎం కిసాన్ ఈకేవైసీ ఈనెల 20 వరకు గడువు పెంచినట్లు చెప్పారు.

నాసిరకం విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - కౌతాళం

నాసిరకం విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఉప్పర హాల్ గ్రామంలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు అఖీరా, తడాఖా, ఆశ రకం విత్తనాలను సాగు చేసినట్లు తెలిపారు. గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారన్నారు. ఇప్పటివరకు 10 కిలోల పంట కూడా రాలేదని రైతులు రమేష్, బీరప్ప, మారెప్ప, మహాదేవ, పెద్ద లింగన్న, బోయ పంపాపతి, బోయ హుస్సేని రైతు సంఘం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ విత్తనాలు ఆదోని పట్టణంలోని దుకాణాల్లో కొనుగోలు చేసినట్లు వివరించారు. నాసిరకం విత్తనాలు కావడంతో దిగుబడి రాలేదని రైతు సంఘం నాయకులతో కన్నీరు పెట్టుకున్నారు. నాసిరకం విత్తనాలు విక్రయించిన వారిపై చర్యలు తీసుకొని, ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల నాయకులు ఈరన్న, వెంకటేశు, నరసింహులు, మారెప్ప, హుస్సేని పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రతి ఇంటికీ తాగునీరందిస్తాం

- వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రతి ఇంటికీ తాగునీరందిస్తామని వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కంబలదిన్నె గ్రామంలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు కోసం సర్పంచి, వైసిపి నేత నరసప్ప ఆధ్వర్యంలో వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నేతలు రవిచంద్ర రెడ్డి, ఎంపిడిఒ వెంకటరమణప్ప భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. పనులు త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామని తెలిపారు. ఎఇ వేణుగోపాల్, ఆర్ఐ మహేష్, విఆర్ఒ సంజీవరావు, పెద్ద ఆంజనేయ, ఈరన్న, మారన్న పాల్గొన్నారు.

అయ్యప్ప విగ్రహానికి జడ్‌పిటిసి విరాళం

ప్రజాశక్తి - చిప్పగిరి

అయ్యప్పస్వామి విగ్రహం ఏర్పాటు కోసం జడ్‌పిటిసి విరుపాక్షి స్వామి విరాళం అందజేశారు. శనివారం చిప్పగిరి అయ్యప్ప స్వామి దేవాలయంలో 3 గంటలకు విరుపాక్షి స్వామి చేతుల మీదుగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి నూతన విగ్రహానికి రూ.20 వేలు అందించారు. విరుపాక్షిని అయ్యప్ప భక్తి మండలి తరపున సన్మానించారు.



అయ్యప్ప స్వామి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న జడ్‌పిటిసి

రైతుల గోడు వినే వారేరి..?

- చూసీచూడనట్లు వ్యవహరించిన మంత్రి, ఎమ్మెల్యేలు

- వినతిపత్రానికే పరిమితమైన కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని



ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ ముందు నిరసన తెలియజేస్తున్న పత్తి రైతులు

ఆరుగాలం కష్టించి సాగు చేసిన పత్తి పంట దిగుబడి రాక నిండా మునిగామని, తమకు న్యాయం చేయాలని రైతన్న కన్నీరు మున్నీరువుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రైతులు అఖీరా కంపెనీకి చెందిన పత్తి విత్తనాలు సాగు చేశారు. పంట ఏపుగా పెరిగి కాయలు ఏర్పడకపోవడంతో పంట దున్ని వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. న్యాయం చేయాలని ఆదోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ ముందు శనివారం నిరసన చేపట్టారు. ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఆదోని ప్రాంత అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, శ్రీదేవి హాజరయ్యారు. కనీసం రైతుల సమస్యలను విన్న పాపాన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.30 వేల చొప్పున పెట్టుబడి అయిందని, రూపాయి కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు. చిన్నహరివాణం, బసాపురం, పెద్దహరివాణం, నాగనాథనహళ్లి గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో ఈ విత్తనం సాగు చేసినట్లు రైతులు శేఖర్, సుధాకర్, సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, వీర సేనారెడ్డి, మల్లికార్జున, హనుమన్న తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఆదోనిలోని విత్తన డీలర్లను అడిగితే 'మీకు తోచింది చేసుసుకోండి. పైసా ఇచ్చే ప్రసక్తే లేద'ని నిర్లక్ష్యంగా చెబుతున్నారని మీడియా ముందు వాపోయారు. ఈ సమస్యపై రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సమక్షంలో చర్చలు జరిపినా ఇంతవరకు శాస్త్రవేత్తలు వచ్చిన దాఖలాలు లేవని మండిపడ్డారు. విత్తన కంపెనీ నుంచి పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవిద్దామని వచ్చామని, ఇక్కడ సమస్యను పట్టించుకునే వారు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకు నిరసన వ్యక్తం చేశారు. రైతులు లోపలికి వెళ్లకుండా సిఐలు విక్రమ్ సింహ, చంద్రబాబు గేటు ముందు బందోబస్తు నిర్వహించారు. అనంతరం ఇద్దరిని పిలిచి కలెక్టర్ వినతిపత్రం తీసుకున్నారని రైతులు తెలిపారు. న్యాయం చేస్తామని, నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టిస్తామని, ఆయా కంపెనీ నుంచి పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారే తప్ప స్పష్టత లేదని తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ కనీసం రైతుల గోడు గురించి కలెక్టర్‌కు విన్నవించకపోవడం దారుణమని పలువురు వాపోయారు.

వలసలు వెళ్లొద్దు.. పనులు కల్పిస్తాం

- ఎమ్మిగనూరు క్లస్టర్ ఏపీడీ అల్లిపీరా

ప్రజాశక్తి - పెద్దకడబూరు

కూలీలు, వ్యవసాయ కూలీలు వలవ వెళ్లవద్దని, ఉపాధి పనులు కల్పిస్తామని ఎమ్మిగనూరు క్లస్టర్ ఏపీడీ అల్లిపీరా తెలిపారు. శనివారం ఎమ్మిగనూరు క్లస్టర్ ఏపీడీ అల్లిపీరా ఆధ్వర్యంలో ఎపిఒ రామన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రఫిక్, దినేష్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రామ్మోహన్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లి, సర్పంచ్ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, మేటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ఈ సంవత్సరానికి అన్ని గ్రామాల్లో 2.49 లక్షల పనులు దినాలు జనరేట్ చేసినట్లు తెలిపారు. దొడ్డి మేకల పంచాయతీలో 15 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. తారపురం పంచాయతీలో కూడా 55 పనులు చేయించినట్లు తెలిపారు. చిన్నకడబూరు సర్పంచి అనసూయమ్మ ఆధ్వర్యంలో కూడా సమావేశం నిర్వహించారు.

నేడు శ్రీమఠం ఆధ్వర్యంలో తుంగాహారతి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఆదివారం తుంగాహారతితో లక్ష దీపోత్సవం కార్యక్రమం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా చంద్రగ్రహణం ఉన్న నేపథ్యంలో రెండు రోజుల ముందు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తుంగభద్ర నదీతీరంలో సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక ఏర్పాట్లతో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెప్పోత్సవం కూడా నిర్వహిస్తున్నారని తెలిపారు.

చంద్రబాబుపై దాడి పిరికిపంద చర్య

- ఆలూరులో టిడిపి నిరసన

ప్రజాశక్తి-ఆలూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై దాడి చేయడం పిరికిపంద చర్య అని మాజీ ఎంపిటిసిలు, టిడిపి నాయకులు భాస్కర్, నర్సప్ప విమర్శించారు. శనివారం టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు ఆలూరులో ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శాంతిభద్రతల విషయంలో వైసిపి ప్రభుత్వ అసమర్థ పాలన మరొకసారి బయటపడిందని తెలిపారు. నారాయణ, చంద్రశేఖర్, మసాల జగన్, రాజశేఖర్, నాగరాజు, ముద్ద రంగన్న, గూళ్యం రామాంజనేయులు, జగన్నాథ, హనుమప్ప పాల్గొన్నారు.



ఆలూరు ప్రధాన రహదారిపై నిరసన చేపడుతున్న నాయకులు

పెద్దకడబూరులో టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి మాట్లాడారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుపై జరిగిన రాళ్ల దాడి పిరికిపంద చర్య అని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా ప్రజల పక్షాన ప్రశ్నించడానికి వెళ్లిన చంద్రబాబుపై రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి రౌడీయిజం, దౌర్జన్యాలు పరాకాష్టకు చేరుకున్నాయని మండిపడ్డారు. చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే వైసిపి నేతలు దాడులకు దిగుతున్నారని విమర్శించారు. జాతీయ నాయకునికి రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



రమాకాంత్‌రెడ్డి

మైనారిటీ ఐటిఐ కళాశాలను ప్రారంభించాలి

- మంత్రికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఆదోని



మంత్రి, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని మండలం ఆరెకల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ మైనార్టీ ఐటిఐ కళాశాలను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాసులు కోరారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఆదోని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మైనార్టీ ఐటిఐ కళాశాల పనులు పూర్తయి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఇంతవరకు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. పట్టణంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల లేక అనేక మంది విద్యార్థులు వేరే మండలానికి వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని మైనార్టీ ఐటిఐ కళాశాల తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, గౌస్, గణేష్, నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

'కుష్టు'ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

- డిపిఎంఒ సీతారాముడు

ప్రజాశక్తి - ఆదోని

కుష్టు వ్యాధి ప్రమాదకరమని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారణ సులభతరం అవుతుందని డిపిఎంఒ సీతారాముడు తెలిపారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎఎన్ఎం, ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఇఒ శివశంకర్, డిప్యూటీ హెచ్ఇఒ దైవప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కుష్టు వ్యాధి నిర్మూలన కోసం ఈ నెల 15 నుంచి వచ్చే నెల 5 వరకు ఇంటింటా సర్వే నిర్వహించాలని తెలిపారు. స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి పరీక్షలు చేయించాలన్నారు. కుష్టు అని నిర్ధారణ అయితే ఎమ్‌డిటి కోర్సుతో మందులు వాడి పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. సమిష్టిగా కుష్టు వ్యాధి నిర్మూలనకు పాటుపడదామని ప్రతిజ్ఞ చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లు న్యూటన్, ఈశ్వర్ రాజు, శ్రీలక్ష్మి, వినీత, ఎఎన్ఎంలు ఉన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు

అంత్యక్రియలకు అష్టకష్టాలు..

- ఆరడుగుల నేల కరువు..
- గతంలో పూడ్చిన సమాధిలోనే మరోసారి..
- రోడ్ల పక్కన, పొలం గట్ల వెంట అంత్యక్రియలు
- స్మశాన వాటికలు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - రుద్రవరం

మనిషి బతికి ఉన్నంతకాలం ఎంతగా పేరు ప్రఖ్యాతలు, సిరిసంపదలు సంపాదించినా చనిపోయిన తర్వాత కలిసిపోయేది మట్టిలోనే.. చనిపోయాక కాడిని కాటికి మోసేందుకు నలుగురు వ్యక్తులు, పాతి పెట్టేందుకు ఆరడుగుల స్థలం ఉండాలని పూర్వం పెద్దలు ఆలోచించి తనకు, తన వారసులకు, బంధువులకు స్మశాన స్థలాన్ని ముందే ఏర్పాటు చేసుకునేవారని చరిత్ర చెబుతుంది. ప్రస్తుత రోజుల్లో మనుషులకు ఈ అంశాలు కష్టంగానే మారాయి. చనిపోయిన వారిని పూడ్చి పెట్టేందుకు స్మశాన స్థలాలు లేక అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. తాత ముత్తాతల కాలంలో కేటాయించిన స్మశాన వాటికలో స్థలాలు సరిపోక అనేక గ్రామాల్లో చనిపోయిన వారిని పూడ్చి పెట్టేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు రుద్రవరం మండలంలోని అనేక గ్రామాలలో కనబడుతున్నాయి.

రుద్రవరం మండల పరిధిలోని పలు గ్రామాలలో స్మశాన వాటికలు లేక అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థలం లేకపోవడంతో మనిషిని పూడ్చిన స్థలంలో మళ్లీ మరొక మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దుస్థితి నెలకొంది. ఇటీవల ఎల్లావత్తుల గ్రామంలో ఒక శవాన్ని పూడ్చిన గుంతలో మళ్లీ శవాలను పూడ్చుతున్న పరిస్థితి ఏర్పడింది. పెద్ద కంబలూరు గ్రామంలో అగ్రవర్ణాల వారు చనిపోతే పొలం గట్లపైనే మృతదేహాలను పాతి పెట్టుకుంటున్నారు. అప్పనపల్లిలో మైనారిటీలకు గతంలో పెద్దలు స్మశాన స్థలాన్ని కేటాయించగా అదే స్థలంలో రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ ముస్లిం మైనార్టీలు చనిపోతే రోడ్డుకు ఇరువైపులా అలుముకున్న ముళ్ళ పొదల స్థలంలోనే శవాలను పూడ్చుకుంటున్నారు. చందలూరు గ్రామంలో ఎవరైనా చనిపోతే గ్రామానికి అతి సమీపంలో ఉన్న చిన్న స్థలంలో మృతదేహాలను ఖననం చేసుకుంటున్న పరిస్థితి ఉంది. అలాగే కోటకొండ, మాచినేనిపల్లి, డి.కొట్టాల, పందిర్లపల్లి గ్రామాలలో మనిషి చనిపోయిన తర్వాత శ్మశానాలలో పూడ్చుకునేందుకు, ఖననం చేసేందుకు స్థలాలు లేక తీవ్ర కష్టాలు పడుతున్నారు. అధికారులు స్పందించి స్మశాన స్థలాలు లేని గ్రామాలను గుర్తించి స్మశాన వాటికలకు స్థలాలను ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఒకే సమాధిలో రెండోసారి మృతహేహాన్ని పూడుస్తున్న దృశ్యం


రోడ్డు పక్కనే శవాన్ని పూడ్చి పెడుతున్న దృశ్యం

స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలి



గ్రామంలో మనుషులు చనిపోతే శవాలను పూడ్చుకునేందుకు స్థలం లేక రోడ్డు పక్కనే పూడ్చిపెట్టిన గుంతలలోనే తిరిగి పాతిపెట్టడం బాధాకరం. స్మశాన స్థలాలను గ్రామానికి కేటాయించాలని ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారులను అడిగాను. అలాగే సంబంధిత రెవెన్యూ అధికారులకు గ్రామస్తులతో కలిసి స్మశాన స్థలాన్ని కేటాయించాలని నివేదికను సైతం అందజేశాను. ఇంతవరకు అధికారులు స్మశాన స్థలాన్ని కేటాయించలేదు. అధికారులు స్పందించి స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలి.

- బిల్లాల చంద్రమోహన్, ఎల్లా వత్తుల గ్రామ సర్పంచి.

అంత్యక్రియలకు స్థలాల కొరత వాస్తవమే..



గ్రామంలో మనుషులు చనిపోతే పూడ్చుకునేందుకు స్థలం లేదన్న మాట వాస్తవమే. గ్రామస్తులు పలు సార్లు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారు. రుద్రవరం తహశీల్దార్‌కి గ్రామస్తులతో కలిసి స్మశాన స్థలాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించి కోరాను. రెవెన్యూ అధికారులు స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తే పంచాయతీ నిధులతో స్మశాన స్థలాన్ని అభివృద్ధి చేస్తాం.

- పాములేటి, ఎల్లావత్తుల గ్రామ పంచాయతీ కార్యదర్శి.

ఉద్యోగ, కార్మిక హక్కుల పరిరక్షణకు

నిరంతర పోరాటం

- డిసెంబర్ 27, 28న సిఐటియు జిల్లా 2వ మహాసభ
- ఆహ్వాన సంఘం సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి - నంద్యాల

ఉద్యోగులు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. డిసెంబర్ 27, 28న జరిగే సిఐటియు నంద్యాల జిల్లా 2వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్థానిక శోభ లాడ్జిలో ఆహ్వాన సంఘం సమావేశం పట్టణ అధ్యక్షులు డి.లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఎన్జీవోస్ అధ్యక్షుడు మణిశేఖర్ రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు సద్దాం హుస్సేన్, అంగన్ వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి షేభారాణి, ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి, వీఆర్ఏ జిల్లా అధ్యక్షులు నాగేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు, కార్మికుల హక్కులపై దాడి చేసినప్పుడు సిఐటియు కీలకంగా వ్యవహరిస్తూ ఉద్యమం విజయవంతం అయ్యేంత వరకు అండగా నిలబడుతుందన్నారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, టెలికాం, పోస్టల్, రైల్వే ఉద్యోగులు చేసి పోరాటాలకు సిఐటియు అండగా నిలుస్తుందని తెలిపారు. నంద్యాల జిల్లాలో కూడా సిఐటియు ఏర్పడిన నాటి నుండి నేటి వరకు నిత్యం ఉద్యోగులు, స్కీం వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై పని చేస్తుందని తెలిపారు. డిసెంబర్ 27, 28న నంద్యాలలో నిర్వహించే సిఐటియు జిల్లా 2వ మహాసభ విజయవంతం కోసం, రాబోయే కాలంలో అనేక పోరాటాలు నిర్వహించడం కోసం సిఐటియుకు హార్థిక, ఆర్థిక సహాయ సహకారాలు అందించి అండగా నిలబడాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో అంగన్ వాడీ యూనియన్ కోశాధికారి నిర్మల, సిఐటియు జిల్లా నాయకులు తోట మద్దులు, ఎల్లయ్య, పట్టణ సహాయ కార్యదర్శి పుల్లా నరసింహులు, పట్టణ కోశాధికారి వెంకట లింగం, అన్ని రంగాల, సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ముమ్మరం చేయాలి

- జగనన్న జగనన్న లేఔట్లలో వసతులు కల్పించండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణాల పనులు ముమ్మరంగా చేపడుతోందని, అధికారులు చిత్తశుద్ధితో కృషి చేసి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ ఇంజనీర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గృహ నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో మొత్తం 48,995 ఇళ్ల మంజూరులో ఇప్పటివరకు 6,339 గృహాలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. 9,009 గృహాలు బేస్మెంట్ స్థాయిలో, 23,411 బిలో బేస్మెంట్ స్థాయిలో, 4580 గృహాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. బిలో బేస్మెంట్ లెవెల్లో ఉన్న ఇళ్లన్నీ పునాది స్థాయికి, పునాది స్థాయిలో ఉన్న ఇళ్లనీ రూఫ్ లెవెల్‌కు, రూఫ్ స్థాయిలో వున్నవాటిని రూఫ్ కాస్ట్ దశకు తీసుకొచ్చి పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఒక్కో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు రెండు గృహాలు స్టేజ్ కన్వర్షన్ కు తీసుకొచ్చేలాగా లక్ష్యాలను నిర్దేశించాలని హౌసింగ్ డిఈలను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద మంజూరైన 12,201 గృహాలకు గాను 11,598 గహాలకు పరిపాలన ఉత్తరంలో మంజూరు చేశామని, ఇందులో 10,378 ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రిజిస్ట్రేషన్, 6,932లకు జియో టాగింగ్ చేశారన్నారు. పెండింగులో వున్న వాటిని వెంటనే పూర్తి చేసి గృహాలన్నీ యుద్ధ ప్రాతిపదికన గ్రౌండింగ్ కావాలని కలెక్టర్ ఆదేశించారు .జగనన్న లేఅవుట్లలో నీరు, ఇసుక, సిమెంటు, స్టీల్ కొరత లేకుండా అన్ని రకాల సదుపాయాలు సమకూర్చేందుకు హౌసింగ్ సిబ్బంది ప్రత్యేక తీసుకోవాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పిడి శేషు బాబు, హౌసింగ్ ఈఈ మాధవరావు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ డిఇలు, ఏఈలు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల వేడి మొదలైంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. పలు పార్టీల నాయకులు ఓట్ల నమోదును కూడా రాజకీయాలకు వాడుకుంటూ కార్యాలయాల్లో ఓట్లను నమోదు చేయిస్తున్నారు. ఏదేమైనా శాసన మండలిలో ప్రజల గొంతుక వినిపించే అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. ముందుగా ఈ నెల 7వ తేదీలోపు ఓటును నమోదు చేసుకోవడం కూడా చాలా ముఖ్యం.

ఎల్ఎల్‌సి నీటి కష్టాలు

తుంగభద్ర లో లెవల్ కెనాల్ (ఎల్ఎల్‌సి)కు నీటి విడుదల నిలిపివేయడంతో జిల్లా వ్యాప్తంగా ఎల్ఎల్‌సి కింద ఉన్న ఆయకట్టు భూములకు నీరు అందకుండా పోయాయి. దాదాపు 15 రోజులు ఇదే పరిస్థితి ఏర్పడింది. కర్ణాటకలోని హగరి నుండి వచ్చే కెనాల్‌లో 121వ కిలో మీటర్ వద్ద మరమ్మతు చేయాల్సి ఉండటంతో నీటి విడుదలను ఆపివేశారు. దాంతో కింది పొలాలకు చుక్క నీరు కూడా అందని దుస్థితి నెలకొంది. సాగు చేసిన పంటలు కనీసం వర్షం ఆధారంగానైనా కాపాడుకోవచ్చని అనుకున్నా వర్షం కూడా కురవలేదు. దీంతో అన్నదాతలకు ఆందోళన తప్పలేదు. చివరికి మరమ్మతు పనులు పూర్తి చేయడంతో ఎల్ఎల్‌సి నుండి నీటిని కిందకి వదిలారు.

బెట్టింగ్ జోరు...

ప్రస్తుతం టి ట్వంటీ వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచులు జరుగుతుండటంతో జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్ జోరందుకుంది. యువత పెద్ద ఎత్తున బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఆన్లైన్ ద్వారా ఈ వ్యవహారం మొత్తం నడుస్తోంది. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని కొందరు రోడ్డు మీద పడుతున్నారు. పోలీసులు పెద్ద ఎత్తున నిఘా పెట్టి యువత బెట్టింగ్ వైపు మళ్లకుండా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

అవీ.. ఇవీ.. అన్నీ..

డివైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించి పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. టిడిపి నాయకులు అయ్యన్న పాత్రుడిని అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.



పోతుల నాగరాజుకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - రుద్రవరం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజుకి మద్దతుగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య శనివారం ప్రచారం నిర్వహించారు. రుద్రవరం సిరివెళ్ల మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ స్కూల్స్, ఏపీ మోడల్ స్కూల్స్‌లో గ్రామ వార్డు సచివాలయాలలో ప్రచారం చేస్తూ 2023 మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో డాక్టర్ పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు వాల్మీకి రాజు, హరికృష్ణ ,శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోతుల నాగరాజుకు మద్దతుగా ప్రచారం ప్రజా సంఘం నాయకులు



చట్టాలకు అనుకూలంగా నడుచుకోవాలి : జడ్జి

కోవెలకుంట్ల : చట్టాలకు ప్రతిఒక్కరూ అనుకూలంగా నడచుకోవాలని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. శనివారం పట్టణంలోని గోటూరు సంజీవరెడ్డి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదివేటప్పుడు సంపాదనపై మక్కువ ఉండకూడన్నారు. అబ్దుల్ కలాం, వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు నేరాలు చేస్తే జీవితం నాశనం చేసుకోవడమేనని చెప్పారు. మెరుగైన సమాజం కోసం పని చేయాలని కోరారు. కేసులు, ర్యాగింగ్ జోలికి వెళితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు ఆరికట్ల మల్లికార్జున రెడ్డి, న్యాయ వాదులు జియల్ నరసింహులు, శ్రీనివాసులు, తిరుపేలు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించారు. కాశీం సాహెబ్, రాజశేఖర్, ఓబులేసు, కంబగిరి, ఉసేని, సుధాకర్, ఇదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అధికారులకు గాయాలు

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని బోయలకుంట్ల మెట్ట గాజులపల్లి-నంద్యాల జాతీయ రహదారి వద్ద తుఫాన్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మహానంది మండలానికి చెందిన నాడు-నేడు అధికారి ఎఇ శంకర్ రెడ్డి, గాజులపల్లి సచివాలయం-1 అసిస్టెంట్ ఇంజనీర్ విజయ్ కుమార్ రెడ్డిలు ద్విచక్ర వాహనంపై వస్తుండగా బోయలకుంట్ల మెట్ట వద్ద తుఫాన్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఏఈ శంకర్ రెడ్డికి కాలు విరిగింది. విజయ్ కుమార్ రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వీరిని అక్కడి స్థానికులు గాజులపల్లి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నాగార్జున రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ఏఈ శంకర్ రెడ్డిని మెరుగైన వైద్యం కోసం నంద్యాల రాయలసీమ ఆసుపత్రికి తరలించారు. తుఫాన్ వాహనాన్ని మహానంది పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బోయల కుంట్ల నాలుగు రోడ్ల కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల ఎదురుగా వాహనాలు వేగంతో వస్తూ అదుపుతప్పి ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అక్కడి స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - ప్యాపిలి

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందివ్వడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెంగళాంపల్లె క్రాస్ రోడ్డు పక్కన తారు రోడ్డు నుంచి ఓబులదేవరపల్లె వరకు రూ. 1 కోటి 78 లక్షల నిధులతో 1.8 కిలో మీటర్లు చేపట్టిన రోడ్డును మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి ఓబులదేవరపల్లె వరకు రెండు కిలోమీటర్ల మేరకు పాదయాత్ర చేశారు. అనంతరం ఓబులదేవరపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్దిదారులకు ఏయో పథకాలు అందాయో వారికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ తాము చేసిన అభివృద్ధి, పార్టీలకతీతంగా అందించిన సంకేమపథకాలు తమ పార్టీకి గెలుపు నిర్ణయిస్తాయని తెలిపారు. 2024లో వైసిపి రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలిచి, డోన్ నియోజక వర్గంలోనూ వైసిపి జెండా ఎగరేస్తామని పేర్కొన్నారు. నాయకులు గజేంద్ర, మీట్ ఛైర్మన్ శ్రీరాములు, జెడ్పిటిసి బోరెడ్డి శ్రీరామరెడ్డి, ఎంపిపి గోకుల్ లక్ష్మి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, మాజీ జెడ్పిటిసి దిలీప్ చక్రవర్తి, ఉప సర్పంచి భువనేశ్వర్ రెడ్డి, బోరా మల్లికార్జున రెడ్డి, రాజా నారాయణమూర్తి, క్రిష్ణారెడ్డి, బోరెడ్డి రాము, చిన్న రామాంజనేయులు, పోదొడ్డి క్రిష్ణమూర్తి, కమతం బాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రంగస్వామి, అనిల్ కుమార్, మోహన్, గుడిపాడు వెంకట్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, విఘ్నేశ్వర రెడ్డి, నాయుడు, ఆర్డిఓ వెంకట రెడ్డి, డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐ శ్రీరాములు, తహాశీల్దార్ శివరాముడు, ఎంపిడిఒ ఫజల్ రహిమాన్, ఇఒఆర్‌డి బాలకృష్ణ, హెచ్‌ఒ కళ్యాణి, డిటి మారుతి, ఆర్ఐ హేమంత్, వైద్యాధికారి వాణిశ్రీ, పిఆర్ ఏఇలు ప్రభాకర్ రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.


ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

జాతీయ పోటీలకు జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు

కోవెలకుంట్ల : జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు జ్యోతి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ సవిత్ నాథ్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 14 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్ జిల్లా విదిశా పట్టణంలో జరగబోయే 41వ జాతీయస్థాయి జూనియర్ పోటీలకు పాల్గొనే ఎపి జట్టులో విద్యార్థులు కార్తీక్ రెడ్డి, శాలిని, లిఖితలు చోటు సంపాదించారని చెప్పారు. వీరు మరింత రాణించాలని అభినందనలు తెలిపారు. విద్యార్థుల ఎంపికకు కృషియ చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు పరమేశ్వరరెడ్డి, సురేష్, పార్వతిలను అభినందించారు.


జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేయాలి

ప్రజాశక్తి - పాణ్యం

ప్రభుత్వం శ్రీబాగ్ ఒడంబడికను అమలు చేయాల్సిందేనని, అక్టోబర్ 1నే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవంగా నిర్వహించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పాణ్యం మండలం నెరవాడ, కొణిదేడు గ్రామాలలో ఈ నెల 16 న విజయవాడలో జరిగే రాయలసీమ సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, నెరవాడ ప్రసాదరెడ్డి, ప్రతాపరెడ్డి, నడిపి ఖాసిం, శ్రీనివాసులు, కొణిదేడు గ్రామంలో గోపవరం శ్రీనివాసరెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, మూగెన్న తదితరులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** రాయలసీమ బతుకు తెరువు సమస్యలపై పార్లమెంట్‌లో ఎంపీలు, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గళం విప్పాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గుళ్ళదుర్తి గ్రామం వినాయక గుడిలో రైతుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒడంబడిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 16న విజయవాడ నడిబొడ్డున వాటి అమలుకై పాలకులను నిలదీద్దామన్నారు. ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పరమేశ్వరరెడ్డి, కె.రామ గోవిందరెడ్డి, చప్పలి రామసుబ్బారెడ్డి, చీమల రాముడు, కంబగిరి రాముడు తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

సిసి రోడ్డు పనులు ప్రారంభం

శిరివెళ్ల : మండలంలోని జీనపల్లి గ్రామంలో 10 లక్షల రూపాయల నిధులతో రోడ్డు నిర్మాణ పనులను సర్పంచి దగడ మహేశ్వరి, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు చీమల అనూష రమేష్ రాయల్, వైసిపి యువనేత రఘునాథ రెడ్డిలు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి మాలధారులకు ఎమ్మెల్యే సోదరుడు గుండ్ల సింగవరం సర్పంచి కాటసాని రమాకాంత్ రెడ్డి శనివారం బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాటసాని తిరుపాల్ రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పణ

మహానంది : పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 414 జయంతి కళ్యాణోత్సవం సందర్భంగా కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి మహానంది దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి దంపతులు, వేద పండితులు తీసుకెళ్లి సమర్పించారు. వీరిని మఠం అధికారులు సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

బనగానపల్లె : పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి నేలమఠం, చింతమాను మఠం, రవ్వల కొండలలో వీరబ్రహ్మేంద్ర స్వామి 414 ఆరాధన మహోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు .

ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

పాణ్యం : ప్రతి మండలంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.మౌలాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పాణ్యం నియోజకవర్గం సమావేశం కాలువ బుగ్గలో అధ్యక్షులు ఎల్లా వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కమిటీ కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర గౌడ్, గోపాల్, శ్రీనివాసులు, రమేష్, విజయ్ కుమార్, నాగరాజు, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా సౌత్ జోన్ పోటీలకు శాంతిరాం విద్యార్థులు ఎంపిక

పాణ్యం : శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఆలిండియా సౌత్ జోన్ పోటీలకు ఎంపికయినట్లు ప్రిన్సిపల్ సుబ్రమణ్యం శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పొద్దుటూరు, రాజంపేటలో జరిగిన జెఎన్‌టియు పోటీలలో నారాయణ రెడ్డి, అనీఫ, అర్పిత మంచి ప్రతిభ కనబరిచి సౌత్ జోన్, ఆల్ ఇండియా పోటీలకు బ్యాడ్మింటన్, చదరంగంలో ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా వారిని ఎండి.శివరాం, ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రమణ్యం, విభాగ అధిపతులు వీరేష్, మల్లికార్జున, ఫిజికల్ డైరెక్టర్ చంద్ర రెడ్డి అభినందించారు.

మహిళపై దాడి - బంగారు గొలుసు చోరీ

బనగానపల్లె : మండలంలోని పాతపాడు గ్రామంలో సినీ పక్కిలో మహిళపై కత్తితో దాడి చేసి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కుమారస్వామి ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించాడు. ఇంట్లో ఉన్న రమాదేవిపై కత్తితో దాడి చేయగా స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. గాయపడిన రమాదేవిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోషకాహార లోపాన్ని అధిగమించాలి

నంద్యాల రూరల్ : ప్రతి ఒక్కరూ పోషకాహార లోపాన్ని అధిగమించేలా సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ తెలిపారు. శనివారం నంద్యాలలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డిఎంహెచ్ఎం ఆర్.వెంకటరమణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లీలావతి అధ్యక్షతన పోషకాహార లోపం, బాల్య వివాహాలు, చిన్న పిల్లల ఆరోగ్యం, రక్తహీనత వ్యక్తిగత పరిశుభ్రత' అంశాలపై వర్క్ షాప్ నిర్వహించారు.

'ఉపాధి'కి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్

కొలిమిగుండ్ల : ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం.జిల్లా సహాయ కార్యదర్శి ఎం సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం కొలిమిగుండ్లలోని సాయిబాబా ఆలయంలో వ్యకాసం మండల కార్యదర్శి దావీదు అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పుల్లయ్య, కార్యదర్శిగా పి దావీదు, ఉపాధ్యక్షులుగా మద్దిలేటి రెడ్డి, వలి, సహాయ కార్యదర్శులుగా జీవయ్య, యోహాను, కోశాధికారిగా చలపతి తదితరులను ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్

ఫ్యామిలీ ఫిజిషియన్‌ను వినియోగించుకోవాలి

- ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రభావతి

ప్రజాశక్తి - పాములపాడు

ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని నంద్యాల జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రభావతి పేర్కొన్నారు. శనివారం అమ్మలూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా ప్రజలు తమ గ్రామంలోనే ఆరోగ్య సేవలు పొందవచ్చు అన్నారు. ప్రతి గ్రామానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం జిల్లా వైద్యశాలలకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈవీ నాగలక్ష్మి దేవి, డాక్టర్ వినోద్, ఎమ్మెల్‌హెచ్‌పి మాళవిక, ఆశ వర్కర్ శ్వేత పాల్గొన్నారు.

వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి - నందికొట్కూరు

వార్డు కౌన్సిలర్లు అల్లూరి కృష్ణ, చాంద్ బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని 3, 24వ వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వారు వార్డుల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. 3,24 వార్డుల్లో రూ.2 కోట్ల 6 లక్షల వ్యయంతో అభివృద్ధి, సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించడం జరిగిందన్నారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో నందికొట్కూరు స్మార్ట్ టౌన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. మున్సిపల్ ఏఈ భాను ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సామన్న

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

: కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - పాములపాడు

కౌలు రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి సామన్న డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో కౌలు రైతు సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సామన్న మాట్లాడుతూ కౌలు రైతులకు రాయితీలు, క్రాప్ లోన్లు, పంట బీమా రైతులకు అందించే ప్రతి పథకాన్ని కౌలు రైతులకు అందించి ప్రోత్సహించాలని కోరారు. గిట్టుబాటు ధర లేక, అధిక రేట్లు, రాయితీలు అందకపోవడంతో కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదని అన్నారు. ఈ సందర్భంగా పాములపాడు కౌలు రైతు సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చెన్నయ్య, మధు, కమిటీ సభ్యులుగా సంజన రామకృష్ణ, రామచంద్రుడు, రంగస్వాములను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల అవగాహన

ప్రజాశక్తి - ఆత్మకూరు

మండలంలోని కరివేన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం క్షయవ్యాధి, కౌమార దశలో వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు టిబి యూనిట్ టిబి సూపర్‌వైజర్ రవికుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు వివరించారు. పౌష్టికాహారం తీసుకొని, వ్యాయామం చేస్తే రోగనిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. అనంతరం ఆర్.కె.ఎస్.కె కౌన్సిలర్ శివజ్యోతి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు సనా ఉల్లా హ్, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - ఆత్మకూర్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా కార్యదర్శి నిరంజన్, ఉపాధ్యక్షుడు కిషోర్, సహాయ కార్యదర్శి దినేష్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని డాక్టర్ ధనుంజయ భవన్‌లో శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ మండల 2వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ విద్యార్థుల పక్షాన నిలబడి పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం భారత విద్యార్థి ఫెడరేషన్ అని అన్నారు. బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానంతో విద్యను వ్యాపారీకరణ, కాషాయీకరణ చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా హిందీలోనే ప్రతి ఒక్కరు చదువుకోవాలని హిందీ భాషను బలవంతంగా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందన్నారు. విద్యార్థుల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా, విద్యార్థి వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. నూతన విద్యా విధానం పేరు చెప్పి 3,4,5, తరగతుల విలీనం ప్రక్రియ అమలు చేసి ప్రాథమిక విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ప్రేమ్ కుమార్, ఓబులేసు, మండల నాయకులు ప్రతాప్, సాయి, రామ్, వెంకీ, లింగయ్య,దిలీప్ రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వివక్షను రూపుమాపే వరకు పోరాటం : కెవిపిఎస్

- డప్పు కళాకారుల పెన్షన్లను ఇవ్వాలి
- కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే. రంగమ్మ

ప్రజాశక్తి - నందికొట్కూరు

సామాజిక వివక్షను రూపుమాపే వరకు కెవిపిఎస్ పోరాటం సాగిస్తుందని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే. రంగమ్మ పేర్కొన్నారు. శనివారం నాడు నందికొట్కూరు కెవిపిఎస్ మండల మహాసభ దేవదాస్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే. రంగమ్మ, జిల్లా నాయకురాలు జి. హుస్సేనమ్మ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు కావస్తున్న దళితులు ఇంకా అభివృద్ధి చెందలేదన్నారు. దళిత వాడల్లో రోడ్లు గాని, కరెంట్ గాని, మంచినీటి సౌకర్యాలు కూడా లేనటువంటి దుస్థితి ఉందన్నారు. దళితుల మీద దాడులు కూడా రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయన్నారు. మండలంలో డప్పు కళాకారుల పెన్షన్‌కు అర్హత కలిగిన డప్పు కళాకారులు ఉన్నప్పటికీ అధికారులు నమోదు చేయడానికి ప్రభుత్వం సహకరించలేదని అన్నారు. మంజూరు చేసిన వారికి డప్పు, డ్రస్, గజ్జలు ఇవ్వలేదన్నారు. మండల అధికారి తక్షణం స్పందించి అర్హత కలిగిన డప్పు కళాకారులకు పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం 25 మందితో నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. నుంకన్న అధ్యక్షులుగా, దేవదాసు, కార్యదర్శిగా సహాయ కార్యదర్శిగా కృపమ్మ, డప్పు కళాకారులు: శేఖర్, పొట్టి వెంకటేశ్వర్లు, భాస్కరు, మల్లెల వెంకటేశ్వర్లు, భూషణం, జిలకర కృష్ణ, జీలకర ఉసేనయ్య, మద్దూర్ లింగస్వామి, మాని కింది శేషన్న, మద్దిలేటి, తిక్క స్వామి, కొండం లక్ష్మన్న, మద్దూర్ ఉసేనయ్య, కెవిపిఎస్ నాయకురాలు నౌషాణి, లక్ష్మీదేవి, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.


కెవిపిఎస్ జెండాలను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ప్యాపిలి

జిల్లా స్థాయి పోటీలకు అండర్ 14, 17 విభాగాలలో ఎన్.రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 35 మంది ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ టి.సురేశ్ బాబు శనివారం తెలిపారు. గతవారం చిన్నమల్కాపురంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీలలో ప్రతిభచూపి వాలీబాల్ జూనియర్, సీనియర్ విభాగాలలో బాలురు, బాలికల జట్లు, త్రోబాల్‌లో బాలికలు, రన్నింగ్, షాట్పుట్ వంటి అథ్లెటిక్స్‌లో విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికకు కృషి చేసిన వ్యాయామోపాధ్యాయులు శ్రీనివాసులుకు, ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు పాఠశాల తరపున శాలువ, జ్ఞాపిక, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, తలితకుమారి, సునీల్, జ్యోతి, శేషయ్య,ప్రేమకుమార్, లక్ష్మానాయక్, సుజాత, జీవలత, ప్రకాశ్ బాబు పాల్గొన్నారు.

చాగలమర్రి : మండలం లోని ముత్యాలపాడు గ్రామ సమీపంలోని బర్డ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు బర్డ్స్ డైరెక్టర్ పాల్ రాజారావు,హెచ్ఎం సింధూర లు తెలిపారు.శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన మహమ్మద్ రఫి,అరుణ్ కుమార్ లు గత నెలలో ఆళ్లగడ్డలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో కబడ్డీ,ఖోఖో విభాగంలో అత్యంత ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను,వ్యాయామ ఉపాధ్యాయుడు రవిశంకర్‌ను బర్డ్స్ డైరెక్టర్ పాల్ రాజారావు,హెచ్ఎం సింధూర, ఉపాధ్యాయ, ఉపాధ్యేయేతర సిబ్బంది అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో బర్డ్స్ డైరెక్టర్ పాల్ రాజారావు


ప్రజలతో మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తోందని, త్వరలో ప్రజలు బుద్ధి చెప్తారని డోన్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బేతంచెర్ల పట్టణంలోని 14వ వార్డులో టిడిపి మండల కన్వీనర్ ఉన్నం యల్ల నాగయ్య, నాయకుడు మేకల నాగరాజు ఆధ్వర్యంలో శనివారం బాదుడే బాదుడు కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి, ఎల్ల నాగయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను బెదిరింపులకు గురిచేసి అక్రమాలు కేసులు బనాయించడం, సమాజంలోని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో నిరంకుశ, అరాచక పరిపాలన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమలేష్ చౌదరి, రామ్మూర్తి, తిరుమలేశ్వర్ రెడ్డి, నాగేశ్వరెడ్డి, మధు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు : వ్యకాస

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూర్ తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో వివిధ పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.పకీర్ సాహెబ్ అన్నారు. శనివారం తహశీల్దార్ సెలవుల్లో ఉండడంతో డిప్యూటీ తహశీల్దార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఉదయం 11 గంటలవుతున్న ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడం శోచనీయమన్నారు. డిప్యూటీ తహశీల్దార్ 11:30 గంటల సమయం అవుతున్న కార్యాలయానికి రాకపోవడంతో ప్రజలు విసుగి చెంది వెనక్కు తిరిగి వెళ్తునారని అన్నారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు మాత్రం ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఒకవైపు చెప్తున్నప్పటికీ వారి ఆదేశాలు బేకాతర్ చేస్తూ సిబ్బంది విధులకు సమయపాలన పాటించకపోవడం విడుదూరమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వివిధ సమస్యలపై తహశీల్దార్‌కు విన్నవించేందుకు వెళ్ళగా కుర్చీలు దర్శనమిచ్చాయన్నారు.


అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న పేరం బయపురెడ్డి

ఘనంగా అయ్యప్ప స్వామి మెట్ల పూజ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

అయ్యప్ప స్వామి మెట్ల పూజ కార్యక్రమంను శనివారం నాడు పేరం బయపురెడ్డి మైనింగ్ కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పేరం సత్య నారాయణరెడ్డి, పేరం నంద కిషోర్ రెడ్డి, ఎస్ఐ రమేష్ రెడ్డి, పేరం సూర్యనారాయణ రెడ్డి, ఏరం నాగేశ్వర్ రెడ్డి, పల్లె సుదర్శన్ రెడ్డి, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి కోరుకున్న కోరికలు తీరుస్తాడని ప్రజలలో విశ్వాసం ఉందని పేరం బయపురెడ్డి అన్నారు. ఈ సందర్భంగా స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు పసుపల విద్యార్థులు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పసుపల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.నిరంజన్ కుమార్, సి.రమ్యశ్రీలు రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సులోచన శనివారం తెలిపారు. ఎనర్జీ కన్జర్వేషన్ అనే అంశంపై నేషనల్ థర్మల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని శెట్టివీడు గ్రామంలో సర్పంచ్ లక్ష్మిదేవి, వైసీపీ నాయకులు రాంనారాయణరెడ్డిలు పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. శనివారం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మురికి కాలువలను జేసిబితో శుభ్రపరచి, వృధా నీరు ఉన్న చోట బ్లీచింగ్, వేస్టాయిల్ చల్లించారు. గ్రామంలోని ప్రజలు వృధా నీటిని రహదారులపై వేయరాదని,పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బైర్లూటిలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో బైర్లూటి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జ్ వి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు పాన్ ఇండియా అవేర్నెస్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నాడు ఉదయం 10:30 ని.లకు బైర్లూటి గ్రామంలోని ఎస్టి రెసిడెన్షియల్ స్కూల్ నందు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి తరపున ప్రచారం

ప్రజాశక్తి - నందికొట్కూరు

వైసిపి శాసనమండలి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని పట్టభద్రులు గెలిపించాలని పట్టణంలోని ఒకటో వార్డులో కౌన్సిలర్ కే చిన్నరాజు శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు కరపత్రాలను పంపిణీ చేశారు. రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని అభ్యర్థించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని శివపురం గ్రామ శివారులో శనివారం 148 ప్లాస్టిక్ సంచుల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్ శనివారం తెలిపారు. గ్రామాల నుండి రేషన్ బియ్యంపే వాహనంలో తీసుకెళ్తుండగా శివపురం గ్రామ శివారులో పోలీసులు స్వాధీనం చేసుకొని, ఆత్మకూర్‌లో ఉన్న రేషన్ గోడౌన్‌కు తరలించడం జరిగిందన్నారు.

మద్దిలేటి స్వామి ఆలయానికి రూ.3.52 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామం పరిధిలో వెలిసిన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి స్వామివారి ప్రసాదం, షాపు లీజులు, టెంకాయలు రూము బాడిగలు, వసూలు వల్ల రూ.3,52,743 లక్షల ఆదాయము వచ్చిందని ఆలయ ఇఒ పాండురంగారెడ్డి తెలిపారు. శనివారం ఇఒ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకోవడానికి భారీగా తరలివచ్చి, ప్రత్యేక పూజలు చేశారన్నారు.

9న నియోజకవర్గ క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఈనెల 9వ తేదీన ఆత్మకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడ మైదానములో శ్రీశైలం నియోజకవర్గ క్రీడా ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సక్రు నాయక్, శ్రీశైలం నియోజకవర్గం స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పి. ప్రభాకర్ శనివారం తెలిపారు. మండలాల్లో ఎన్నిక కాబడిన క్రీడాకారులను మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్స్ తీసుకొని రావాలపి కోరారు. ఇక్కడ ఎంపిక కాబడిన క్రీడాకారులను కర్నూలు జిల్లాలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు వెళ్తారని శ్రీశైల నియోజవర్గ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ప్రభాకర్, ఆత్మకూరు మండలం స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శ్రీమతి జె.వి పద్మలతలు తెలియజేశారు.

అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ముత్తలూరు గ్రామంలో 2వ అంగనవాడీ కేంద్రం భవన నిర్మాణానికి సర్పంచి మహేశ్వరి శనివారం భూమి పూజ చేసి పనులు ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ పద్మావతి హాజరై మాట్లాడారు. నాడు-నేడు పథకం కింద అంగన్వాడీ భవనం నిర్మించేందుకు రూ.15 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, రాజేశ్వరమ్మ, రాజకుమారి, సుగుణ శ్రీ, ఇంజనీర్ అసిస్టెంట్ వేద నరసింహుడు, సచివాలయ మహిళా పోలీస్ లలితమ్మ, గ్రామ పెద్దలు నంద్యాల రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

పేద ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అప్పలాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకి సర్పంచ్ రామసుబ్బమ్మ, వైసీపీ నాయకులు అశోక్ రెడ్డి, హరీష్ రెడ్డి, గాలి వీరారెడ్డి, తిరుపం రెడ్డిల ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ పేదలందరికీ కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, మండల ఇంజనీరు వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఉయ్యాలవాడ : మండలంలోని రూపనగుడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నిర్వహించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందిన వివరాలను తెలియజేశారు. సంబంధిత పత్రాలను వారికి అందజేశారు. ఏపి ఎస్ఐడిసి చైర్మన్ కర్ర గిరిజమ్మ, నంద్యాల మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దేశం సుధాకర్ రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ పోచ రాధాకృష్ణారెడ్డి, బోడెమ్మనూరు పోచ వెంకటరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, రూపనగుడి గ్రామ సర్పంచి దేశం సోమశేఖర్ రెడ్డి, అన్ని గ్రామాల సర్పంచులు, తహశీల్దార్ రవికుమార్, ఇఒపిఆర్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గంగుల

కౌలు రైతుల సమస్యలపై విస్తృత పోరాటం

ప్రజాశక్తి - నంద్యాల

కౌలు రైతుల సమస్యలపై విస్తృత పోరాటాలు నిర్వహించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి సద్దాం హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం ఎపి కౌలు రైతు సంఘం నంద్యాల మండల మూడవ మహాసభ ఎన్జిఓ కాలనీలోని టి.నరసింహయ్య భవన్ లో జరిగింది. మండల అధ్యక్షులు ఏలియా అధ్యక్షత వహించగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.మార్కు ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులకు బ్యాంకు రుణాలు ఇస్తున్నామని ఎంతో ఆర్భాటంగా చెబుతున్నా ఎక్కడ కూడా కౌలు రైతులకు జాయింట్ లేబుల్‌గా రుణాలు వచ్చిన పరిస్థితి లేదన్నారు. జిల్లా అధ్యక్షులు ఎస్ మార్క్ మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలలోని మొక్కజొన్న, మినుము, వేరుశనగ పంటలు చేతికి వచ్చినాయని, ఇటీవల కురిసిన వర్షాల వలన పంటలు దెబ్బతిన్నాయని, వారిని ఆదుకొని పండించిన పంటలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కౌలు రైతులకు దేవదాయ భూములు బహిరంగంగా వేలం పాటలు పెట్టాలని, నెలవారిగా పింఛన్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కౌలు రైతు సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యకాసం మండల కార్యదర్శి బంగారయ్య, రత్నమయ్య, కౌలు రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు డి సద్దాం హుస్సేన్

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలంలోని పెద్దకొట్టాల గ్రామం దళిత కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉచిత కంప్యూటర్ తరగతులను మొదటి తరగతి మెజిస్ట్రేట్ బి.అర్చన, ఎంఇఒ బ్రహ్మం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. ప్రస్తుత కాలంలో విద్యార్థి దశలోనే కంప్యూటర్ నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. అనంతరం పాఠశాలకు కంప్యూటర్‌ను ఇచ్చిన దొరస్వామి ఆయన ధర్మపత్ని నీలిమ స్వర్ణలతను మెజిస్ట్రేట్ అర్చన పూలమాలతో సత్కరించారు. అనంతరం అంగన్వాడీ విద్యార్థులకు ఆటవస్తులను బహుకరించారు, పాఠశాలకు స్థలం ఇచ్చిన దాత నంద్యాల శేఖర్ రెడ్డిని ఎంఇఒ సన్మానించారు. అనంతరం వైసిపి నాయకుడు వైస్ ప్రెసిడెంట్ సీలం శివనాగిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి చొరవతో ఇప్పటికే గ్రామానికి ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించామని తెలిపారు.

దళిత కాలనీకి ఉచిత మినరల్ వాటర్, స్మశానానికి కాంపౌండ్ వాల్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.రాముడు, పంచాయతీ కార్యదర్శి భార్గవి, పాఠశాల హెచ్ఎం స్వప్న కుమారి, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్ మిరియమ్మ, ఆశా వర్కర్ మరియమ్మ, హిజ్రాల హక్కుల ఉద్యమకర్త పిడిసెల విజయకుమార్, మాల మహానాడు అధ్యక్షుడు బెల్లం రాజ్ కుమార్, జనసేన నాయకుడు మేకల నాగ పుల్లయ్య, బండి పేతురు తదితరులు పాల్గొన్నారు.

చల్లా కుటుంబానికి సిఎం భరోసా కొండంత అండ

- చల్లాకు నివాళులు అర్పించిన అందరికీ ధన్యవాదాలు

ప్రజాశక్తి - అవుకు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన భరోసా చల్లా కుటుంబానికి కొండంత అండ అని చల్లా కుటుంబ సభ్యులు తెలిపారు. చల్లా కుటుంబ సభ్యులు చల్లా శ్రీదేవమ్మ, చల్లా శ్రీలక్ష్మి, చల్లా సూర్య ప్రకాష్ రెడ్డి, చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా విజయభాస్కర్ రెడ్డి, చల్లా అమర్నాథ్ రెడ్డి, చల్లా రఘునాథ్ రెడ్డి, చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, బందారెడ్డి, పథ్వీ రెడ్డిలు కలిసి శనివారం చల్లా భవన్లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2021 జనవరి 1న సీనియర్ నాయకుడు స్వర్గీయ చల్లా రామకృష్ణారెడ్డి ఎమ్మెల్సీగా ఉంటూ మరణించారని తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మూడు నెలల వ్యవధిలోనే ఎమ్మెల్సీ పదవిని చల్లా భగీరథ్ రెడ్డికి ఇచ్చి అండగా నిలిచారని గుర్తు చేశారు. ఇచ్చిన ఎమ్మెల్సీ పదవితో రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ ముఖ్యపాత్రను పోషిస్తూ 16 నెలల కాలంలోనే చల్లా భగీరథ్ రెడ్డి తీవ్ర అనారోగ్యంతో కోలుకోలేక మరణించడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి మా కుటుంబం పట్ల ఉన్న విశ్వాసంతో అప్పటికప్పుడే అవుకు వచ్చి దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ కొండంత అండగా ఉంటానని భరోసా ఇచ్చినట్లు చల్లా కుటుంబ సభ్యులు తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్ మా కుటుంబం పట్ల చూపుతున్న ఆదరాభిమానానికి జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. చల్లా భగీరథ్ రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటి నుండి అంత్యక్రియలు పూర్తి అయ్యేవరకు వెన్నంటి ఉన్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డికి నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి, , ఆర్థిక శాఖ మంత్రి, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో పాటుతో పాటు అన్ని విధాలుగా సహకరించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర శాఖల అధికారులకు, పత్రికా యాజమాన్యాలకు, ప్రజలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ.7 లక్షల చెక్కు అందించిన ఆర్థిక మంత్రి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రూ.7 లక్షల చెక్కును అందజేశారు. మండల పరిధిలోని బుగ్గాన పల్లి గ్రామ నివాసి అయిన కల్లూరి శ్రీనివాసులు అనే రైతు ఏప్రిల్ నెలలో ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. శనివారం నాడు బాధిత కుటుంబానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన చేతుల మీదుగా మృతుడు భార్య రమాదేవికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి మాట్లాడుతూ వర్గాల ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చేయడమే ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ రెడ్డి, కోడె వెంకటేశ్వర్లు, గుణి నాగరాజు, లక్ష్మీరెడ్డి, చింతల నాగిరెడ్డి, నారాయణ, ఎద్దులన్నా శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు ఎస్ఐ జి. అశోక్ మళ్లీ బాధ్యతలు


ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు ఎస్సైగా జి అశోక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సెప్టెంబర్ 28న పిడిఎస్ బియ్యం కేసు నమోదు విషయంలో జీవో అమలు చేయలేదని జరిగిన తప్పిదంపై హై కోర్టు ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈనెల నాలుగో తారీఖు సస్పెన్స్ ఆర్డర్స్‌ను ఎత్తివేస్తూ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయగా ఎస్సై అశోక్ మళ్లీ బాధ్యతలు చేపట్టారు.

కేసీ కెనాల్‌లో పడి ఆశా కార్యకర్తకు గాయాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

బట్టలు ఉతికేందుకు వెళ్లి ఆశా కార్యకర్త ప్రమాదవశాత్తు కేసీ కెనాల్‌లో పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెహ్రు నగర్ గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త ఎస్ రాణి బట్టలు ఉతుకెందుకు తన కూతురుతో కలిసి కేసీ కెనాల్‌కు వెళ్ళింది. బట్టలు ఉతుకుతూ అదుపుతప్పి ప్రమాదవశాత్తు రాణి కెనాల్‌లో పడింది. అక్కడే ఉన్న రాణి కూతురు కేకలు వేయడంతో అక్కడే ఉన్న కిషోర్ రెడ్డి అనే వ్యక్తి కెనాల్‌లోకి దూకి రాణిని కాపాడాడు. పగిడ్యాల ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



పంటల సాగులో మెళకువలపై శిక్షణ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని చిన్నకంబలూరు మెట్ట దగ్గర వ్యవసాయ సిబ్బందికి పంటల సాగులో రైతులు తెలియజేయాల్సిన మెళకువలు, సూచనలపై డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిడిఏ జయదేవ్, ఏడిఏలు రామ్మోహన్ రెడ్డి, సరళమ్మ, ట్రైనర్స్ ప్రసాదరావు, కళ్యాణ్ కుమార్, ప్రభావతమ్మలు హాజరై సిబ్బందికి అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు, ఎరువుల వాడకం, వేప నూనె వాడకం, ఆర్‌బికెల పరిధిలో రైతులకు సలహాలు సూచనలు ఏ విధంగా ఇవ్వాలి, తదితర అంశాలపై సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో రుద్రవరం వ్యవసాయ అధికారి శ్రీ కృష్ణ, వ్యవసాయ అధికారులు కిషోర్ కుమార్ రెడ్డి, సుధాకర్, అబ్దుల్ హక్, రంగ నేతాజీ, ఉద్యానవన శాఖ అధికారి నరేష్ కుమార్ రెడ్డి, ఆళ్లగడ్డ, చాగలమర్రి, గోస్పాడు, సిరి వెళ్ల, రుద్రవరం మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు, ఎంపీఈవోలు, తదితరులు పాల్గొన్నారు.